సాక్షి సూర్యాపేట

ఆదివారం । 15 । జనవరి । 2023



యాదాద్రికి పోటెత్తిన భక్తులు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భోగి పండుగ సందర్భంగా భక్తులు పోటెత్తారు. - 10లో



వైభవంగా భోగి బోనాలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మోత్కూరులో శనివారం భోగి బోనాలను ఘనంగా నిర్వహించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32°/17°

ఉదయం ఆకాశం పొగమంచుతో మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు



పాటిల్ హేమంత్ కేశవ్, కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలోని ప్రజలందరూ సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ శనివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.

నేడు భువనగిరికి వందేభారత్



సాక్షి,యాదాద్రి : తెలుగు రాష్ట్రాలకు కేటాయించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు భువనగిరి రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలకనున్నారు. రైలును ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు వెళ్లే ఈ రైలుకు భువనగిరిలో నిమిషం పాటు హాల్టింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్‌లో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికలు పంపారు. స్థానిక నాయకులను ఆహ్వానించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు



సంతాపసభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రైతులు, పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బూరుగడ్డలో ఏర్పాటు చేసిన సీపీఎం సీనియర్ నాయకుడు పావులూరి కృష్ణయ్య సంతాప సభలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఎరువులపై సబ్సిడీ ఎత్తివేసి నల్ల చట్టాలు తీసుకొచ్చి రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సబ్సిడీ కరెంటును ఎత్తి వేయాలని మోదీ ప్రభుత్వం చట్టాలు చేస్తోందని ఆరోపించారు. వ్యవసాయ బావులకు మీటర్లు పెట్టి రైతుల నుంచి కరెంటు చార్జీలు వసూలు చేయాలని చూస్తోందన్నారు. దీనిని వ్యతిరేకించడానికి దేశవ్యాప్తంగా రైతాంగం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగారపు పాండు, జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, పోషణబోయిన హుస్సేన్, షేక్ యాకుబ్, శీలం శ్రీను, వెంకటరెడ్డి, రాములు, వీరయ్య, వెంకటయ్య, మురళి, వీరమల్లు, వెంకటనారాయణ, వీరబాబు, అంజయ్య, సైదులు, రామలింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ : వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోతి సంపత్‌రెడ్డి, వీరారెడ్డి, నిజాముద్దీన్, మల్లిఖార్జున్, మంజూ నాయక్, చందు, మోతీలాల్ పాల్గొన్నారు. హుజూర్‌నగర్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అంజలీపురానికి చెందిన అల్లపురి శ్రీనివాస్‌కు ఉత్తమ్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

• కనుల పండువగా గోదాదేవి కల్యాణం



సూర్యాపేట పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు



గోదారంగనాథస్వామి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

సెల్యూట్.. సైనికుడా..!

- దేశ సేవలో ఉమ్మడి జిల్లా యువకులు
- జవాన్ నుంచి కల్నల్ స్థాయిలో విధులు
- యుద్ధ సమయాల్లో ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాటం
- దేశ రక్షణలో పలువురి వీరమరణం
- రిటైర్డ్ అయిన తర్వాత కూడా సమాజ సేవకు అంకితం

నేడు ఇండియన్ ఆర్మీ డే



తమ బతుకునే ఫణంగా పెట్టి తన కోసం, తన కుటుంబం కోసం కాకుండా దేశం కోసం ఉద్యోగం చేస్తుంటారు కొందరు. పుట్టిన ఊరికి దూరంగా, కన్నవారికి, కట్టుకున్న వారికి కనపడకుండా ఎండా, వానను లెక్క చేయకుండా చలికి వణుకుతూ అనుక్షణం ఎదురయ్యే ప్రమాదాలతో సహజీవనం చేస్తూ దేశసేవకు తమ జీవితాలను అంకితం చేస్తుంటారు. వారే మన భారత సైనికులు. త్యాగానికి నిదర్శనంగా నిలుస్తున్న నిజమైన దేశ భక్తులు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా జనవరి 15వ తేదీన ఆర్మీ డే జరుపుకుంటాం. పోరాటాల పురిటిగడ్డగా పేరొందిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎందరో యువకులు ఆర్మీలో పనిచేస్తున్నారు. అనేక మంది రిటైర్డ్ అయి సమాజ సేవలో ఉన్నారు. నేడు సైనిక దినోత్సవం సందర్భంగా.. వారిపై ప్రత్యేక కథనం.

(బి.జనార్దన్‌రెడ్డి)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 1300 మంది వరకు త్రివిధ దళాల్లో పనిచేశారు. వీరిలో ఎయిర్‌ఫోర్స్‌లో 50 మంది, నేవీలో 20 మంది వరకు పని చేశారు. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారు దాదాపు 400 మంది వరకు జవాన్ స్థాయి నుంచి కల్నల్ హోదా వరకు సైన్యంలో పనిచేస్తున్నారు. సైనిక సంక్షేమ శాఖ వద్ద ఉన్న సమాచారం ప్రకారం 1300 మందిలో కొంతమంది యుద్ధంలో వీరమరణం పొందారు. వివిధ కారణాలతో మరో 350 చనిపోయారు. మన జిల్లాకు చెందిన పలువురు సైనికులు 1965లో జరిగిన పాకిస్తాన్ యుద్ధంలో, 1977లో జరిగిన బంగ్లాదేశ్ విభజన సమయంలో, 1999 కార్గిల్ యుద్ధంలో, 2021లో చైనా బలగాలను నిలువరించిన ఘటనలో పాల్గొన్నారు. నల్లగొండ, సూర్యాపేట ప్రాంతానికన్నా భువనగిరి ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో సైన్యంలో చేరుతున్నారు. వలిగొండ మండలం ఎదుళ్లగూడెంలో 15 మంది మాజీ సైనికులు ఉన్నారు. ముగ్గురు ప్రస్తుతం సైన్యంలో పనిచేస్తున్నారు.

ప్రజాప్రతినిధులుగా..

త్రివిధ దళాల్లో పనిచేసిన పలువురు రిటైర్డ్ అయిన తరువాత ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవలందిస్తున్నారు. కోదాడ, హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా, ప్రస్తుతం నల్లగొండ ఎంపీగా పనిచేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారత వాయుసేనలో మిగ్ యుద్ధవిమానం పైలెట్‌గా పనిచేశారు. శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ సర్పంచ్ సైదులు సైన్యంలో పనిచేసినవాడే. హాలియా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సుధాకర్ కూడా సైన్యంలో పనిచేశారు. ఇలా చాలా మంది ఉన్నారు.

అగ్నిపథ్‌కు భారీ స్పందన

సైనిక నియామకాల కోసం ప్రభుత్వం ఇటీవల కొత్తగా 'అగ్నిపథ్' విధానాన్ని తీసుకొచ్చింది. దీనిలో చేరడానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి దాదాపు 7000 మంది యువకులు ముందుకొచ్చారు. వీరికి ఫిజికల్, మెడికల్ టెస్ట్‌లు పూర్తి కాగా త్వరలో రాత పరీక్ష జరుగుతుంది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం విజయరాఘవాపురానికి చెందిన మాజీ సైనికుడు కల్నల్ డాక్టర్ సుంకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'ది షోల్జర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో వివిధ అంశాలలో ఉచితంగా శిక్షణ ఇచ్చారు.

దేశసేవకు ఆ కుటుంబం అంకితం

- ఒకే ఇంటి నుంచి ముగ్గురు సైన్యంలోకి

ఆర్మీలో ఉద్యోగం అంటేనే బయపడే కాలంలో దాదాపు మూడు దశాబ్దాల క్రితం మారుమూల గ్రామంలో పుట్టిపెరిగి, ఒకే ఇంటి నుంచి ముగ్గురు అన్నదమ్ములు దేశసేవ కోసం సైన్యంలో చేరి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరిలో ఇద్దరు ఉద్యోగ విరమణ పొందగా మరొకరు దేశమాత సేవలోనే ఉన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన అల్లి రామచంద్రయ్య- లక్ష్మి దంపతులకు నలుగురు కుమారులు సైదులు, వెంకటేశ్వర్లు, గంగరాజు, సురేష్ ఉన్నారు. పెద్ద కుమారుడు సైదులు 1998లో తొలిప్రయత్నంలోనే ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. అన్నను స్ఫూర్తిగా తీసుకొని తమ్ముళ్లు వెంకటేశ్వర్లు 2005లో గంగరాజు 2011లో సైన్యంలో చేరారు. నాలుగవవాడైన సురేష్ అన్ని రకాల పరీక్షలు పాసై ఆర్మీలో చేరుదామనుకొనే సమయంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఉద్యోగంలో చేరలేకపోయాడు. అతను ఇంటి వద్ద ఉండి వ్యవసాయం చేసుకుంటున్నాడు. 1998లో ఉద్యోగంలో చేరిన సైదులు 2014లో నాయక్ హోదాలో ఉద్యోగ విరమణ పొందాడు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై సేవలందిస్తున్నాడు. వెంకటేశ్వర్లు 2022లో లాన్స్‌నాయక్ హోదాలో రిటైర్ అయ్యాడు. గ్రామంలోనే ఉండి సైన్యంలో చేరాలనుకుంటున్న వారికి శిక్షణ ఇస్తున్నాడు. గంగరాజు ప్రస్తుతం హవాల్దార్ హోదాలో జమ్మూకశ్మీర్‌లో పనిచేస్తున్నాడు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని గ్రామానికి చెందిన మరో ఐదుగురు యువకులు సైన్యంలో చేరారు.



అల్లి సైదులు



అల్లి వెంకటేశ్వర్లు



అల్లి గంగరాజు

క్రమశిక్షణ అలవడుతుంది



ఆర్మీ ఉద్యోగం అంటేనే క్రమశిక్షణ, నీతి నిజాయితీలకు మారుపేరు. సైన్యంలో చేరిన ప్రతి ఒక్కరూ కఠోర శిక్షణతో పాటు శరీరదారుఢ్యం, మానసిక స్థైర్యం, ఆత్మరక్షణలో రాటుదేలుతారు. నేడు సైన్యంలో చేరేందుకు యువత ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. ఇది దేశరక్షణకు మంచి పరిణామంగానే భావించవచ్చు. నాడు సైన్యంలో చేరేందుకు ఒక్క ఉద్యోగానికి 10 మంది పోటీపడితే నేడు సైన్యంలో ఒక్క ఉద్యోగానికి వందల సంఖ్యలో పోటీపడుతున్నారు.

– అల్లి సైదులు, మాజీ సైనికుడు, ఇటుకులపహాడ్ సర్పంచ్

ఆదుకుంటున్నామా..

యుక్త వయస్సులో అన్నీ వదులుకొని దేశసేవ కోసం పనిచేసిన సైనికులు రిటైర్డ్ అయిన తరువాత వారికి అందాల్సిన సౌకర్యాలు సక్రమంగా అందడం లేదనే విమర్శలున్నాయి. మాజీ సైనికుల డిమాండ్‌లు అపరిష్కృతంగా ఉన్నాయి. చాలా మంది తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మాజీ సైనికుల డిమాండ్స్ ఇవీ..

- ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు 2 శాతం నుంచి 5 శాతానికి పెంచాలి.
- మాజీ సైనికులకు కేటాయించిన ఉద్యోగాలు ఒకసారి భర్తీ కాకుంటే వాటిని బ్యాక్‌లాగ్ చేసి మళ్లీ మాజీ సైనికులకే కేటాయించాలి.
- మాజీ సైనికుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందించాలి.
- ఉచితంగా ఇంటి స్థలాలు కేటాయించాలి.
- రాయితీ మీద మాజీ సైనికులకు ఇచ్చే సరుకుల కోసం ఉమ్మడి జిల్లాలో క్యాంటీన్ ఏర్పాటు చేయాలి. సరుకుల కోసం హైదరాబాద్‌కు వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంది.
- ఉమ్మడి జిల్లాలో మాజీ సైనికులకు స్మారక చిహ్నం నిర్మించాలి.
- మాజీ సైనికులకు జీఓ నంబర్ 69 ప్రకారం సత్వరమే అన్ని సౌకర్యాలు కల్పించాలి.



- 2020 సంవత్సరం జూన్‌లో చైనా సరిహద్దులోని గాల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన ఘర్షణలో ప్రాణాలు అర్పించిన సూర్యాపేటకు చెందిన కల్నల్ సంతోష్‌బాబు

దేశసేవకు మించిన తృప్తి మరొకటి లేదు



దేశం కోసం పనిచేయడానికి మించిన తృప్తి దేనిలోనూ ఉండదు. ఇటీవల అగ్నిపథ్ నియామకాల కోసం సూర్యాపేట జిల్లా నుంచి నేను ఏర్పాటు చేసిన 'ది షోల్జర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో జిల్లా అధికారుల సహకారంతో 225 మందికి శిక్షణ ఇవ్వగా తుది రాత పరీక్షకు 167 మంది ఎంపికయ్యారు. ఇది ఆనందించదగ్గ విషయం. యువత ఇంకా ముందుకు రావాలి.

– రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు, విజయరాఘవాపురం, మునగాల

దేశం రుణం తీర్చుకున్నా



సైన్యంలో పనిచేసి దేశం రుణం తీర్చుకున్న తృప్తి మిగిలింది. నేను చదువుకునే రోజుల్లో సికింద్రాబాద్ వెళ్లాను. అక్కడ మిలటరీ వారిని చూసి నేను కూడా సైన్యంలో చేరాలనుకున్నాను. 20 సంవత్సరాల వయస్సులో 1962లో సైన్యంలో చేరాను. 1965లో పాకిస్తాన్ యుద్ధంలో, 1971లో బంగ్లాదేశ్ యుద్ధంలో పాల్గొన్నా. 1977లో రిటైర్డ్ అయ్యాను. తరువాత ఫైర్ ఆఫీసర్‌గా పనిచేశాను. రెండు యుద్ధాల్లో పాల్గొని దేశం కోసం పనిచేసిన తృప్తి ఎప్పటికీ ఉంటుంది. యువత కూడా దేశం కోసం పనిచేయడానికి ముందుకు రావాలి.

– సంధి పాపిరెడ్డి, అయిటిపాముల, కట్టంగూర్ మండలం



పల్లెకు పండుగ కళ



పాలకవీడులో గంగిరెద్దు ఆటలు



వర్ధమానుకోటలో చిన్నారికి భోగిపండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు

- జిల్లావ్యాప్తంగా ఘనంగా భోగి పండుగ
- సూర్యాపేటలో వేడుకల్లో పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : ఓవైపు రంగురంగుల రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. మరోవైపు భోగి మంటలతో సంక్రాంతి సంబురాలు షురూ అయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచే పల్లె పట్నం అనే తేడా లేకుండా ప్రజలంతా భోగి వేడుకలను ప్రారంభించారు. కొన్నిచోట్ల చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీగోదాసమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలతో జిల్లాలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. సూర్యాపేట జిల్లాకేంద్రంలో జరిగిన భోగి వేడుకలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని 45వ వార్డు, 9వ వార్డు, సాయిబాబా దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భోగి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలతో అనేక రకాల పండుగలు మనిషి జీవితాన్ని మరింత సుఖమయం చేసేందుకు దోహదపడతాయన్నారు. ప్రతి పండుగ ప్రతి ఒక్కరికీ మంచిని అందించేందుకు భారతీయ సమాజం నుంచి వచ్చిందన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంక్రాంతి పండుగను ప్రారంభిస్తూ భోగి మంటలు వేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గండూరి ప్రకాష్, 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, గండూరి కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మకర సంక్రాంతి

మూడురోజుల సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం మకర సంక్రాంతిని ప్రధాన పండుగగా ప్రజలు జరుపుకుంటారు. పొంగలి, పిండివంటలను పితృదేవుళ్లకు తర్పణాలు వదులుతారు. డూడూబసవన్నలు (గంగిరెద్దులు) విన్యాసాలు చేస్తాయి.



సూర్యాపేట పట్టణంలోని 45వ వార్డులో భోగి మంటల వద్ద స్థానికుల సందడి

అభివృద్ధిలో కాంట్రాక్టర్ల భాగస్వామ్యం అవసరం

- డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి జగదీశ్ రెడ్డి



సూర్యాపేటలో డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రజలతో పాటుగా కాంట్రాక్టర్లు భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 డైరీ, క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు విద్యుత్ కాంట్రాక్టర్లతో పాటు యావత్ రైతాంగానికి ఎంతో దోహదపడుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలు సరఫరా చేసే భారం తప్పిందన్నారు. ఇటువంటి అంశాలు విద్యుత్ కాంట్రాక్టర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యావత్ భారతదేశంలో వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్ప సిద్ధియే తార్కాణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్‌కే.మాజిద్, తెలంగాణ విద్యుత్ లైసెన్సింగ్ బోర్డ్ డైరెక్టర్ పర్వతాలు, సూర్యాపేట అసోసియేషన్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, హుజూర్‌నగర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జానకి రామిరెడ్డి, నల్లగొండ ప్రెసిడెంట్ యాదగిరి, సత్తిరెడ్డి, వహీద్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

సూర్యాపేట : ఈనెల 18వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ కోరారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కంటి వెలుగు ఏర్పాట్లపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటివెలుగుపై ముందుగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలు, కరపత్రాలు అందించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 100 రోజుల పాటు రోజూ 50 టీమ్‌లతో కంటివెలుగు శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాల ఏర్పాటుకు కావాల్సిన సామగ్రిని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చేర్చామన్నారు. కార్యక్రమాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కోట చలం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ హర్షవర్ధన్ , డాక్టర్ ఎం.డీ. నిరంజన్, కంటి వెలుగు కార్యక్రమ అధికారులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నాజియా పాల్గొన్నారు.



గోదావరి జలాలు పెంపు

అర్వపల్లి: యాసంగి సీజన్‌కుగాను వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో గోదావరి జలాలను జిల్లాకు పెంచారు. 1400 క్యూసెక్కుల నీళ్లు వస్తుండగా రైతుల వినతి మేరకు 1600 క్యూసెక్కులకు పెంచినట్లు ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ ఎం. సత్యనారాయణ తెలిపారు.







యాదాద్రిలో గోదాదేవి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు


ఆలయ ముఖ మండపంలో కల్యాణ వేడుక నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంతో పాటు అనుబంధ శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం గోదాదేవి కల్యాణం అచార్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, రాత్రి యాదాద్రి శ్రీస్వామి వారి ప్రధానాలయంలో గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం చేపట్టారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో నెల రోజుల పాటు గోదాదేవి తిరుప్పావై వ్రతాన్ని ఆచార్యులు నిర్వహిస్తూ వచ్చారు. నాలుగు రోజులుగా అమ్మవారికి నీరాటోత్సవం చేపట్టిన అర్చకస్వాములు శనివారం రాత్రి గోదాదేవిని, శ్రీరంగనాథుడిని అలంకరించి సేవపై ఊరేగించారు. అనంతరం శ్రీరంగనాథుడు గోదాదేవి కల్యాణ వేడుక జరిపించారు. అంతకు ముందు గోదాదేవి, శ్రీరంగనాథుడి కల్యాణ సేవకు ముందు పట్టు వస్త్రాలతో ఆలయ ఈఓ గీతారెడ్డి నడిచారు. భాజాభజంత్రీలు, మేళతాళాలతో అంగరంగ వైభవంగా వేదమంత్రాలతో ఈ కల్యాణ తంతును చేపట్టారు. ఈ వేడుకతో ధనుర్మాసం పూర్తయిందని ఆచార్యులు వెల్లడించారు. ఆదివారం ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

మట్టపల్లి క్షేత్రంలో..


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం భోగి పండుగను పురస్కరించుకుని శ్రీగోదాదేవి రంగనాయకస్వామి కల్యాణాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ధనుర్మాస పూజలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత వేదమంత్రోచ్చరణల నడుమ మాంగళ్యధారణ గావించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, చెన్నూరు మట్టపల్లి రావు, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాలని సంతకాల సేకరణ


సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

గుండాల : బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ కొమ్ము సరిత, పసునారి సంతోష మాట్లాడారు. బహుజన సమాజ్ పార్టీ బీసీల రాజ్యాధికారం కోసం పోరాడుతుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీసీ గణన ప్రకారం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీ, పార్లమెంట్‌లలో టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గడ్డం శ్రీకాంత్, అనిల్‌కుమార్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వలిగొండ : మండలంలోని వేములకొండ మూసీ పరీవాహక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డికి సన్మానం


కోటిరెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

మునగాల: మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి నంద్యాల కోటిరెడ్డి దంపతులను శనివారం మండలంలోని ముకుందాపురంలో పలువురు పోలీసు శాఖ ఉద్యోగస్తులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఇటీవల ఐపీఎస్ హోదా పొంది వికారాబాద్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న నంద్యాల కోటిరెడ్డికి తన అమ్మమ్మ గారి ఊరైన ముకుందాపురంలో ఘనస్వాగతం లభించింది. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సన్మాన సభలో గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సభకు గ్రామానికి చెందిన రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పందిరి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కోటిరెడ్డి మాట్లాడుతూ తాను పుట్టింది మాధవరంలో అయినప్పటికీ బాల్యం, విద్యాభ్యాసం ముకుందాపురంలో జరిగిందని, నాకు రెండు గ్రామాలు రెండు కళ్ల లాంటివన్నారు. ముకుందాపురంలో పలువురు యువకులు పోలీసుశాఖలో కొలువు సంపాదించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ముకుందాపురం గ్రామాభివృద్ధికి తన వంతు సాయంగా రూ.లక్ష ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉద్యోగస్తులు పందిరి బ్రహ్మారెడ్డి, పందిరి చంద్రశేఖర్‌రెడ్డి, నర్రా అంతిరెడ్డి, ఆర్.రాజశేఖర్‌రెడ్డి, నర్రా ఎల్లారెడ్డి, బి.నవీన్‌రెడ్డి, ఎస్.సీతరామిరెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, గ్రామసర్పంచ్ పందిరి కళావతి, ఎంపీటీసీ సభ్యురాలు నూకమళ్ల ఇందిర పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వంగపల్లిలో మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రేస్ బాల్ క్రికెట్ క్రీడా పోటీలను శనివారం ఆయన టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగాలు సంపాదించాలని కోరారు. గ్రామీణ క్రీడాకారుల్లో ఉత్తమ ప్రతిభ దాగి ఉందని దాన్ని ప్రతీఒక్కరూ బయటకు తీయాలన్నారు. కాగా తుర్కపల్లి జట్టుపై, మేడ్చల్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు రేపాక స్వామి ఆర్గనైజర్స్ కానుగు రాజీవ్‌గౌడ్, మహేంద్ర యువసేన అధ్యక్షుడు ఎండీ అజ్జు, బొట్టు రాజుగౌడ్, కానుగు లక్ష్మణ్, కప్పల నరేష్, మహేష్, గోపికృష్ణ, నాగరాజు, మహేష్, ఎండీ హబీబ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరులో భోగి బోనాలు


కంఠమహేశ్వర స్వామికి బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

మోత్కూరు : సంక్రాంతిని పురస్కరించుకొని మో త్కూరులో శనివారం భోగి బోనాలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పెద్దమ్మ తల్లి, కంఠమహేశ్వర స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ముందుగా పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ కులస్తులు, కంఠమహేశ్వరస్వామికి గౌడ కులస్తులు బోనాలతో వెళ్లి ఆయా ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. మోత్కూరులోని బిక్కేరు వద్ద ఉన్న పెద్దమ్మ తల్లి, కంఠమహేశ్వరస్వామి, ఇందిరానగర్ కాలనీ సమీపంలో, జామ చెట్లబావి వద్దఉన్న కంఠమహేశ్వ రస్వామి దేవర్లకు తీపి బోనాలు నిర్వహించారు.







గట్టుపైకి పార్వతీదేవి


గట్టుపైకి అమ్మవారిని తీసుకెళ్తున్న చెర్వుగట్టు సిబ్బంది

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని గట్టు కింద గల శ్రీపార్వతిదేవి ఆలయంలో శనివారం తెల్లవారుజామున దేవాలయ ప్రధాన అర్చకులు పోతుల పాటి రామలింగేశ్వర శర్మ అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. భోగి పండుగ సందర్భంగా గట్టు కింద గల దేవాలయం నుంచి అమ్మవారిని గట్టుపైకి తీసుకెళ్లారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత అమ్మవారిని కిందకి తీసుకొస్తారు. ఈ సందర్భంగా ఈఓ నవీన్‌కుమార్ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యాక్ గుర్తింపులో భాగస్వాములు కావాలి

మిర్యాలగూడ అర్బన్: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిటేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపులో విద్యార్థులు భాగస్వాములు కావాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లెర్నింగ్ సపోర్టు సెంటర్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులకు న్యాక్ నుంచి వచ్చే ఈ మెయిల్స్‌లో యూనివర్సిటీకి సంబంధించిన ప్రశ్నావళి పొందుపరిచారని, వాటిని పరిశీలించి సమాధానాలను.. సంబంధిత లింక్‌లో నింపి సబ్‌మిట్ చేయాలని సూచించారు. న్యాక్ నుంచి మూడు దశలుగా మెయిల్స్‌లో వచ్చిన వాటిని నెలరోజుల పాటు సందర్శిస్తూ విద్యార్థి సంతృప్తి సర్వేను సబ్‌మిట్ చేసి యూనివర్సిటీకి వచ్చే న్యాక్ గుర్తింపులో భాగస్వాములు కావాలని కోరారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

■ గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569. [HA-868]

HOUSE FOR SALE

■ 377 చదరపు గజముల తూర్పు ఫేస్ ఇండిపెండెంట్ ఇల్లు అమ్మకమునకు కలదు. బకాల్‌వాడ స్కూల్ వెనుక అశోక్‌నగర్, మిర్యాలగూడ. సంప్ర॥ 9133120895 [Y-746798]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776024]

■ ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ ద్వారా పార్ట్ టైం మరియు ఫుల్‌టైం వ్యాపార అవకాశం కలదు. వివరాలకు సంప్ర॥ మేనేజర్ : 9985944266 [Y-772727]

■ Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd, మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com [HA-779938]

■ Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

■ కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట మండలంలోని ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో మా సంస్థ అయిన సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్, గుంటూరు తరుపున పనిచేయుటకు మంచి దేహదారుఢ్యము కలిగిన సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు 30-45 సం॥ అర్హత: ఇంటర్/డిగ్రీ, ఎత్తు:05'-06'' ఆపైన, రిటైర్డ్ ఆర్మీ పారా మిలటరీ వారికి ప్రాధాన్యత. సెక్యూరిటీ గార్డ్ అర్హతలు: వయస్సు 30-45 సం॥ పదవ తరగతి, ఎత్తు: 05'-06'' ఆపైన సంప్ర: 8466996958, 7901389772 [G-522]

Services

BUSINESS OFFER

■ Good Oppartunity to Earn Money PIS, Contact : Khammam. Cell : 89196 56387. [M-1203134]

వధువు కావలెను

■ చాత్తాద శ్రీవైష్ణవ (BC) 5'11 ఇంటర్ D.Ed వయస్సు 30 సం॥రాలు మరియు 5'9 డిగ్రీ వయస్సు 28 సం॥రాలు కల్గిన తల్లిలేని ఇద్దరు అబ్బాయిలకు తగిన వధువులు కావలెను. ఉద్యోగం/వ్యాపారం చేయుచున్న వధువులు ఇల్లరికం కోరుకొనువారు సంప్ర॥ నల్లగొండ. 9849422530 [YA-14560]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.